# మా మంచి మామయ్య!

"ఏరా! నీ చదువు ఎలా సాగుతూంది" అంటూ భుజాన ఒక లెదర్‌బ్యాగూ, రెండు చేతుల్లోనూ రెండు కర్ర బ్యాగ్‌లతోనూ ఏకాంబరం మామయ్య ప్రవేశించాడు ఇంట్లోకి.

నల్లని ప్యాంటు మీద నల్లని గళ్ళ చొక్కా సుమారు ఆరు అడుగుల పెర్సనాలిటీ, చిన్న సైజు కుండ బోర్లించినట్లున్న పొట్ట, చొక్కా చివరకు తన్నుకొచ్చే పొట్టను బెల్ట్‌తో వేలాడదీసినట్లుగా పొత్తికడుపు కిందనే బెల్ట్‌తో పొట్టను బంధించి టకప్ చేసుకుంటాడు మామయ్య. మామయ్యకు అచ్చివచ్చిందంట, నలిగిపోయి, బ్రౌన్ కలర్ కోల్పోయి, ముట్టుకుంటేనే అది బెల్ట్ అని చెప్పొచ్చు, అలాగే కళ్ళజోడు మధ్యలో మాత్రం షేపులో వుండి, రెండు కనులూ రెండు రంగుల్లో వుంటాయి. ఇక గడియారం అయితే పాత రోలెక్స్ కంపెనీదంట, మామగారు పెళ్ళికి ఏడ్చుకుంటూ పెట్టారు అని చెపుతుంటాడు. నల్లని కుండ బోర్లించినట్లుగా బట్టతల, చామనఛాయకు కొంచెం ఎక్కువ, నలుపు రంగుకు కొంచెం తక్కువగా వుంటాడు ఏకాంబరం మామయ్య.

"అమ్మా మామయ్య వచ్చాడే" అని లోపలకు వినిపించేలా కేకేశాను. "అన్నయ్యా ఇదేనా రావడం" అంటూ అమ్మ ఒక చేత్తో చీరకొంగును అద్దుకుంటూ, మరోచేతిలో మంచినీళ్ళచెంబుతో వచ్చింది.

"అవునే చెల్లాయ్ వీడి చదువు ఎంతవరకూ వచ్చింది. ఆ 'బి.ఏ.' పూర్తి అయిందనుకో, నాకు చేదోడువాదోడుగా వుంటాడు. ఇంట్లో ఇద్దరు ఆడంగుల మధ్యన, వారిద్దరి మధ్యనా నలిగిపోయే ఒకే ఒక్క ఆడపిల్లతోనూ, మరో పక్క స్కూలు మెయిన్‌టెనెన్స్‌తోనూ బాధపడుతున్నాననుకో" అన్నాడు మామయ్య. చెంబుడు నీళ్ళు తాగేస్తూ. అందరూ గ్లాసుడు నీళ్ళు తాగుతారు కాని కుండలాంటి మామయ్య బొజ్జకు గ్లాసుడు నీళ్ళు ఏ మూలకూ చాలీచాలవు. ఎన్నిచ్చినా ఇట్టే తాగేస్తాడు.

అమ్మ వెంటనే – "ఇంకెంతలేరా. ఆఖరి సంవత్సరంలోకి వచ్చేశాడు, ముందు రెండు సంవత్సరాలలోనూ మూడు పేపర్లుండి పోయాయి. అవి ఈ సంవత్సరంలో రాసేస్తాడులే. ఐనా వీడు సరిగ్గా చదివేడ్వడంలేదరా. మధ్యలో వరల్డ్‌కప్ క్రికెట్, 20 ట్వంటీ మ్యాచ్‌లు వచ్చాయి.

అప్పుడప్పుడు క్రికెట్‌లో బ్యాటింగ్ కూడా నేర్చుకుంటున్నాడనుకో. ఏమో ఎవరు చెప్పొచ్చేరు ఆంధ్రా ధోనీ అవచ్చుగదా. కాలేజీకి సరిగ్గా వెళ్ళడురా. ఒక్కగానొక్కడని నాకు గారాబం. ఇకపోతే వాళ్ళ నాన్నగారు క్యాంపులూ, ఉద్యోగం, ఎప్పుడు వస్తారో, ఎప్పుడు వెళ్తారో ఆయనకు పిల్లల గోల తెలియదు. అందరూ ఇంజనీర్లు, డాక్టర్లు చదివేసి దేశాలు పట్టి పోతున్నారు. వీడేమో ఇలాగ..." అంటూ అమ్మ బ్యాండ్ మొదలుపెట్టింది.

వెంటనే మామయ్య అందుకున్నాడు. "అరేయ్ బడుద్దాయ్. ఫస్టియర్, సెకండియర్‌లో మిగిలిపోయిన పేపర్లు రాసేటప్పుడు నాకు ఫోన్ చెయ్యి, వాచర్ల మొహాన్న అంత డబ్బు పారేసి నిన్ను గట్టున పారేస్తాను. మూడోసంవత్సరం పరీక్షలకూడా నన్ను పిలువ్. ఎగ్జామినర్‌ని పట్టుకుని నేనే రాసిపారేస్తాను. వెధవ పరీక్షలు..." అంటూ మామయ్య ముక్కులోకి తులం నశ్యం సరఫరాచేశాడు. మామయ్యకు ఒక గజం దూరంలో వున్న నాకు, ఫ్యాన్‌గాలితో కలిసిపోయి ఓ చిటికెడు నశ్యం నా ముక్కులోకి దూరి ఒక్కసారిగా ధామ్మని తుమ్మేను.

"అరేయ్ భడవాయ్ హడిలి చచ్చాన్రా, మా నాన్న కూడా ఇలాగే తుమ్మేవాడు. మీ అమ్మేమో అప్పుడప్పుడు, మీతాత తుమ్మినప్పుడు దడుచుకుని, 'అమ్మో...' అనేదిరా" అంటూ నవ్వేడు. ఆ నవ్వు డబ్బాలో రాళ్ళేసి గలగలలాడించినట్లుగా వుంటుంది. మామయ్య తుమ్మితే పసిపిల్లలకి దడుపు జ్వరం వచ్చేయడం ఖాయం అంటూంటుంది అమ్మ.

"అన్నయ్యా స్కూలు ఎలావుంది?" అంది అమ్మ లోపల నుండి గ్లాసుడు కాఫీ పట్టుకునివచ్చి. "చూడవే... గవర్నమెంట్ ఎయిడ్‌తో స్కూలు నడపడం వుంది చూశావూ, చాలా చికాకైన వ్యవహారం అనుకో. గవర్నమెంటాఫీసుల్లో ఎయిడ్ కోసం వాళ్ళ చేతులు తడుపుకుంటూ, వాళ్ళ గొంతెమ్మ కోరికలు తీరుస్తూ, గత ఇరవై సంవత్సరాలుగా నానా యాతనా పడుతున్నాననుకో..." అన్నాడు మామయ్య.

"అది సరేలే అన్నయ్యా. ఇరవై సంవత్సరాల నుండి నెట్టుకొస్తున్నావాయె. నీకు తప్పుతుందా ఏమిటి? లేచి కాళ్ళు కడుక్కో. వంటైపోయింది. నువ్వు పది గంటలకే నాలుగు ముద్దలు తింటావ్ కదా. మళ్ళీ సాయంత్రం ఏ టైముకు వస్తావో ఏమో..." అంది అమ్మ మామయ్యవైపు చూస్తూ! మామయ్య తాను తెచ్చిన సంచులన్నీ ఒక మూలగా జాగ్రత్తగా పెట్టి, తన లెదర్ బ్యాగ్‌లోంచి, తాను పెళ్ళినాడు కట్టుకున్న వెలిసిపోయిన ఎర్రని పట్టుపంచె తీసి కట్టుకుని భుజాన కండువా వేసుకుని లోపలకెళ్ళాడు.

నేను తీరని కోరికలు, తీరే కోరికలూ, అసలు కోరికలు ఎన్ని, కోరికలు ఎందుకు కలుగుతాయి వంటి అసందర్భమైన ఎకనామిక్స్ చదవడం మొదలుపెట్టాను. మాయదారిది ఈ ఎకనామిక్స్. ఎంత చదివినా నాకు అర్థంకాదు. మొదటి రెండేళ్ళలో

మిగిలిపోయిన పేపర్లు ఈ మాయదారి ఎకనామిక్సే. 'అసలు కోరికలు అనేవి లేకుండా వుండాలంటే, మనిషి సన్యాసం తీసుకుంటే ఏ సమస్యా వుండదు' అని ఒకసారి మా లెక్చరర్‌గారితో క్లాసులో దబాయించాను. ముక్కచీవాట్లు పెట్టారాయన, ఇక ఎకనామిక్స్‌లో నేనేలా పాసవుతాను?

మామయ్య భోజనంచేసి వచ్చాడు. కర్రల బ్యాగ్‌లోంచి ఒక ఇత్తడిబాక్స్ తెరిచాడు. ముందు కాస్త వక్కపొడి నోట్లో వేసుకున్నాడు. ఆ తరువాత రెండు తమలపాకులు తీసిసున్నం రాసి, యాలకులు, లవంగాలు, జాజికాయ, జాపత్రి, వగైరాలు వేసుకుని నమిలాడు. ఆ తర్వాత లంక పొగాకు కాడతీసి సిగరెట్‌లా చుట్టుకుని నోట్లోపెట్టుకుని రెండు దమ్ములు లాగాడు. గుట్కా ప్యాకెట్ ఒకటి తీసి నోట్లో పెట్టుకుని, పళ్ళతో తెంపి మొత్తం నోట్లో పోసుకున్నాడు. ఆ తరువాత చెంబుడు నీళ్ళు తాగాడు. తరువాత లెదర్ బ్యాగ్‌లోంచి అమృతాంజనం సీసా తీసి నుదురూ, ముక్కు మొత్తం పట్టించాడు. విక్స్ బాటిల్‌తీసి ముక్కు లోపలా బయటా, నుదురుకూ, దాదాపు ముఖమంతా రాసుకున్నాడు. అప్పుడు హమ్మయ్య అనుకుని, చొక్కా జేబులోంచి నశ్యం డబ్బా తీసి, ఒక తులం నశ్యం ముక్కులోకి సరఫరా చేశాడు.

ఇదంతా చలన చిత్రంలాగా చూస్తున్న నన్ను చూసి మామయ్య నవ్వుతూ... "వెధవాయ్ ఎప్పుడూ చూసేవే ఏం చూస్తావ్ గానీ నా కార్యక్రమం పూర్తి అయింది. ఇప్పుడు నేను ఇంచక్కా ఒక చిన్న కునుకు తీస్తాను గాని, నువ్వు నన్ను పదినిముషాల్లో లేపాలి. తెలిసిందా...పదిన్నర గంటలకల్లా నేను ఆఫీసుకు బయలుదేరాలి" అన్నాడు.

"మామయ్య- నీ పొట్టలోకి ఇన్నిరకాల రసాయన పదార్థాలు పంపిస్తున్నావు కదా, ఇంతవరకూ నీకు ఏమీ కాలేదా?" అన్నాను. "అంటే నీ ఉద్దేశ్యం నా పొట్టలో రసాయనచర్య జరిగి పగిలిపోతుందనా?" అంటూ ఘొల్లుమని నవ్వి, నన్ను జడిపించినంత పనిచేసి "ఈ తెలివితేటలు చదువుపై చూపించు" అన్నాడు.

మరుక్షణంలో వెనకటి రోజుల్లో 'దొంగలబండి' అనే రైలుకు రైలింజను వుండేదిట. మా నాన్నగారు చెబుతుంటారు. సరిగ్గా అలాంటి ఇంజను నడిచినప్పుడు వచ్చే శబ్దాలతో గురకపెడుతూ, ఇంకా అనేక శబ్దాలు వెలువరిస్తూ మామయ్య నిద్రపోయాడు. నేను ఇక అక్కడ వుండలేక, అమ్మ దగ్గరకు లోపలికి వెళ్ళిపోయాను, కాలేజీకి వెళ్ళడానికి తయారవడానికి.

మామయ్య తూర్పుగోదావరి జిల్లాలో ఒక మారు మూల గ్రామంలో స్కూలు నడుపుతున్నాడు స్వంతంగా. ప్రభుత్వ సహాయం కూడా తీసుకుంటూ వుంటాడు. మా అత్తయ్య పెళ్ళినాటికి పదోక్లాసు మాత్రమే చదివింది. అతి త్వరలో ఆమెను చక్కగా

బి.ఇడి. చేయించేశాడు. ఆమె చెల్లెలు పెళ్ళికి రెడీగా వుంటే, ఆమె పదో తరగతిలో వుండగా ఆమెను బడి మానిపించేసి, లైనులోపెట్టేసి ఆమె చేత "నాకు పెళ్ళి వద్దు, ఇష్టం లేదు" అనిపించేశాడు. ఆమెనూ అనతికాలంలోనే బి.ఇడి చేసేశాడు.తనూ పెద్దత్తయ్య, చిన్నత్తయ్య బి.ఇడిలు, మరో ఇద్దరు దిక్కులేనివాళ్ళని చేరదీసి అన్ ట్రైన్డ్ టీచర్స్‌ని చేసేశాడు. ఇంట్లో పనమ్మాయిని అటెండర్‌ని చేసేశాడు.

ఇంతలో అసలు అత్తయ్యకి ఒక పిల్ల పుట్టింది. అనవసరంగా పిల్లలు పుట్టడం ప్రమాదం, పైగా డబ్బు ఖర్చు కూడానూ అని భావించి, తను చెప్పాపెట్టకుండా పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయించేసుకున్నాడు.

దీనికంతటికి అసలు కారణం నేనే.

అదెలాగంటే, నన్ను ఇల్లరికం ఉంచేసుకుని, ఉన్న ఒక్క పిల్లనీ నాకు కట్టబెట్టేసి, ఆ స్కూలులో నన్ను కూడా మేస్టర్ని చేసేసి, స్కూలు మొత్తం ఎవరి పరం కాకుండా, మా కుటుంబ ఉమ్మడి ఆస్తిగా వుంచేసుకుంటే, బయటకు డబ్బు వెళ్ళకూడదని మామయ్య ఆలోచన. మామయ్య కూతురు మంగ బాగానే వుంటుంది. ముఖ్యంగా చిన్నప్పటి నుండీ దాని మనుసులో నన్ను, నా రూపాన్ని ప్రతిష్ట చేసేసి, ప్రిపేర్ చేసేసేదేమో, ఆ పిల్ల నన్ను చూస్తే చాలు మెలికలు తిరిగిపోతూ, నేను ఆమెను ఏదో చేసేసినట్లుగా ఫీలైపోతూ వుంటుంది.

ఎటో చూస్తూ ఆలోచిస్తూ కలలో విహరిస్తున్న నన్ను డిస్టర్బ్ చేస్తూ... "ఒరేయ్ పరీక్షలు పెట్టుకుని, ఏమిటాలోచనలు, బాగా చదివి చావు. పరీక్షల టైముకు నేను వస్తాను..." అంటూ మామయ్య ఇంట్లో ప్రవేశించాడు. "అది కాదు మామయ్య నిన్నెప్పుడూ అడగలేదు. నువ్వు వచ్చినప్పుడల్లా రెండు కర్రసంచుల నిండా ఏం పట్టుకువస్తావ్" అన్నాను నేను.

"అదా. చెప్తానులే. మరి మన స్కూల్లో పనులకోసం ఆఫీసుల్లో రకరకాల మనుషుల్ని కలుస్తానుకదా, వాళ్ళ పనులుచేసి, మనకు డబ్బులు వచ్చే ఏర్పాటుచేయాలి కదా. వాళ్ళకు అడపాదడపా పదీపరకా ఇస్తే చాలదురా. వాళ్ళ ఇష్టాయిష్టాలు తెలుసుకుని అవి ఇచ్చామే అనుకో, ఐస్‌కూల్ అయిపోయి మనకి కావాల్సినవి చకచకా చేసేస్తారు. మరి ఇరవైఏళ్ళ నుండి స్కూలు ఎలా లాక్కు వస్తున్నాననుకున్నావ్" అంటున్న మామయ్య మాటలకు అడ్డువచ్చి. "ఎందుకు డబ్బు పారేస్తే పనులైపోవా, నువ్వు అనవసరంగా శ్రమపడతావు" అన్నాను.

"అది కాదురా బడుద్దాయ్. కానుకలు ఇస్తే పుచ్చుకునేవాడు గాలి ఊదిన బెలూన్‌లా అయిపోయి, మనకు పది రూపాయలు మంజూరు చేయాలనుకో, యాభై రూపాయలు చేసేస్తాడురా" అంటూ ముక్కులోకి తులం నశ్యం సరఫరా చేసేశాడు

మామయ్య. ఆ తరువాత మేం ఇద్దరం ఆ ముక్కుపొడి ధాటికి, హాలు రీసౌండ్ వచ్చేట్లుగా తుమ్మేశాం.

ఇంతలో అమ్మ బయటకొచ్చి- "వంటయింది అన్నయ్యా భోజనానికి లే" అంటూ లోపలకు వెళ్ళిపోయింది. "ఒరేయ్ నీకు వివరంగా చెపుతాను విను, ఇవిగో ఇవి తాపేశ్వరం కాజాలు, మనకు పోస్టులు మంజూరు చేసే మనిషికి ఇష్టం, ఇవి ఆత్రేయపురం పూతరేకులు, మన టీచర్లకు సెలవులు ఇచ్చే ఆయనకు భలే ఇష్టం. ఇవి బెల్లం కరకజ్జాలు ఇవి కాగితాల మీద సంతకాలు పెట్టే సూపరెన్టెంటుగారికి ఇష్టం. ఇవి సామర్లకోట కాజాలు, గవ్వలు... ఇవేకాకుండా మన స్కూలుకు అప్పుడప్పుడు ఇన్‌స్పెక్షన్‌కి వచ్చే పెద్దాఫీసరు గారికి పులసచేపల పులుసంటే ఇష్టంరా బాబూ. పెద్దాపురం సంతలో దొరికే ఉప్పు చేపలంటే, రొయ్యపొట్టంటే ఇష్టంరా బాబూ. ఇవన్నీ వేరేవాళ్ళ చేత వండించి ముక్కులు మూసుకుని మరీ సరఫరా చేస్తానురా, నేను ఆఫీసుకు వెళ్తానంటే వాళ్ళందరికీ నిజంగా పండగే అనుకో..." వింటున్న నాకు బుర్ర గిరగిరా తిరిగిపోయింది.

"మామయ్య మరి నేను మీ స్కూలులో పనిచేయాలంటే ఇవన్నీ చెయ్యాలంటావా" నాకు భయమేసింది. "భడవా, భయపడి చావకు. నేనున్నాన్నాళ్ళూ నీకు ఏంలోటూ లేదు. అన్నీ నేనే చూసుకుంటాను. ఈలోగా నీకు ఈ విషయాలలో ట్రెనింగ్ ఇస్తాన్లేరా..." అన్నాడు.

అప్పుడు గాని నాకు అర్థంకాలేదు. మామయ్య పగలూ, రాత్రీ భోజనం అయ్యాక, తనకు మూడ్ బాగా లేనప్పుడు వక్కపొడి, తాంబూలంతో మొదలుపెట్టి విక్స్ డబ్బా వరకూ రసాయనాలు కడుపులోకి పంపే కార్యక్రమం ఎందుకు చేస్తున్నాడో. అయితే నేనూ స్కూలులో ప్రవేశిస్తే ఏమేం చేయాల్సి వస్తుందో. అమ్మో! భయం వేసింది నాకు. తన దిమ్మెక్కిపోయింది. చుట్టకాల్చాలేమో. నేను ఆలోచనల్లో వుండగానే మామయ్య భోజనానికి వెళ్ళిపోయాడు. పాతకాలం బోడింజన్ బొగ్గురైలు వెళ్తున్నట్లుగా, మామయ్య భీకరమైన శబ్దాలతో కునుకు తీస్తుంటే నేను రెడీ అయ్యి కాలేజీకి బయలుదేరాను.

కాలం చాలా వేగంగా గడిచిపోతూంది. నా బి.ఏ మూడో సంవత్సరం పరీక్షలయిపోయాయి. మామయ్య మేనేజ్‌మెంట్‌లో రెండో సంవత్సరం, మొదటి సంవత్సరంలో మిగిలిపోయిన పరీక్ష పేపర్లు కూడా ఫస్టు క్లాసుకన్నా ఎక్కువ మార్కులు వచ్చేట్లుగా రాసేశాను, నా బొంద పేపర్లన్నీ శుభ్రంగా చూసిరాసేశాను, మామయ్య కోపరేటివ్ మూవ్‌మెంట్‌తో.

నేను వీక్లీ చదువుకుంటుంటే అమ్మ వచ్చింది. "అమ్మా నేను మామయ్య వాళ్ళింటికి అల్లుడుగా వెళ్ళలేనే. నన్ను కనీసం మన ఊళ్ళో సుబ్బయ్య కిరాణా కొట్లో

పొట్లాలు కట్టుకోమన్నా కట్టుకుని బతుకుతానుగాని, ఈ విషయంలో నన్ను వదిలేయాలె నువ్వు..." అంటున్నానో లేదో.... అమ్మ వెంటనే నోటికి చీరకొంగు అడ్డంపెట్టుకుని, ముక్కు చీదేసి, కళ్ళు తుడుచుకోసాగింది.

"మా అన్నయ్య పిచ్చోడురా; వాడిని బుట్టలోవేసుకుని, రుక్మిణీ, సత్యభామల్లాగా మీ అత్తయ్యలిద్దరూ చెరో పక్కనా చేరి దోచేసుకుంటున్నార్రా. ఒక్కగానొక్క నా ముద్దుల మేనకోడలు, పిచ్చిపిల్ల బుట్టబొమ్మలా అందంగా వుంటుందిరా. దాని బతుకు బండలు చేసేస్తారేమోనని నా బెంగంతా. నువ్వంటే దానికెంత ఇష్టం అనుకున్నావ్... అది అమాయకురాలురా" అంటున్న అమ్మను చూస్తూ, ఆమె మాటలకు అడ్డువచ్చి...

"అమ్మా నీకు వున్నపళంగా కళ్ళల్లో నీళ్ళొస్తాయా లేక ఊరికినే తుడిచేసుకుంటావా, నీకు వ్యతిరేకంగా మాట్లాడితే చాలు. ఎదుటివాళ్ళని మాట్లాడనియ్యకుండా ముక్కు చీదేసి కళ్ళు తుడిచేసుకుంటావ్, ఎదుటివాడు డంగైపోవడం ఖాయం. నాన్నగారు విశ్వామిత్రునిలా కోపంతో రగిలిపోతున్నాసరే బలే టాకిల్ చేసేస్తావ్. నీతో నాకు పెద్ద చావొచ్చిపడిందే...." అన్నాను.

అమ్మ వెంటనే తన శోకాలు కంటిన్యూ చేస్తూ... "పోనీలేరా. నువ్వు ఈ విషయంలో నా మాట వినకపోతే మా అన్నయ్యగారింటికి వెళ్ళి బావిలో పడి ఛస్తాను. నీళ్ళు తోడుతుంటే అలవాటులేక కాలుజారి పడిందని ఏడిచి ఊరుకోండి. ఆ అపఖ్యాతి మీకెందుకు?..." అంటూ ముక్కు చీదుకోవడం కంటిన్యూ చేస్తూనే ఉంది. "పరీక్షలైపోయాయి కదా, మామయ్య దగ్గరకెళ్ళాల్సి వస్తుందని ఇలా అంటున్నానని అనుకుంటున్నావా?" అన్నాన్నేను సముదాయించడానికి.

"అవునులే నీలాంటోడు ఏరుదాటి తెప్పతగలేశాడట. నీ పరీక్షలకోసం హాలులో వుండే ఆయనకి పెద్దాపురం పాపలు కావాలంటే మామయ్య వాళ్ళని పెద్దాపురం తీసుకెళ్ళాడంట తెలుసా నీకు? మామయ్య మంచాడురా. నాకు వున్నది ఒక్కడేరా, పిచ్చి అన్నయ్య. వాడిని, వాడి కూతుర్ని నువ్వే చూసుకోవాలిరా" అంటూ గభాల్న నన్ను కావలించుకుని ఏడ్వసాగింది అమ్మ. నన్ను వదలడం లేదు. సరిగ్గా సినిమాల్లో క్లైమాక్స్ సీన్ ఇదే కదా, సమస్య పరిష్కారం కూడా అయిపోతుంది కదా!

"సరే అమ్మా. నీ ఇష్టం" అన్నాను. అమ్మ మామయ్యా ఎంత పనిచేశావ్ అనుకుంటుండగా ఇంతలో ముక్కు పొడుం ఘాటుతో సహా మామయ్య వస్తూనే- "అమ్మాయ్ ఏమంటున్నాడు అల్లుడు" రెండు కర్రల బ్యాగ్స్, లెదర్ బ్యాగ్ భుజాన అలంకరించుకుని మరీ దిగాడు.

"నీ పరీక్ష పేపర్లు దిద్దే లెక్చరర్స్ వివరాలు తెలుసుకుని వాళ్ళని ఖుషీ చేసేశాను. నీ బి.ఏ అయిపోయింది. ఇక నుండి నువ్వు నాకూడా వుండి మన స్కూలు బాగోగులు చూడాలి. నిన్ను బి.ఇడి చేసేయాలి..." నాకు ఇంకేం వినపడడంలేదు. నేను మామయ్య మేనేజ్‌మెంట్ కబంధహస్తాల్లో ఇరుక్కుపోయాను. అంతే సంగతులు. "అలాగే మామయ్య నీ ఇష్టం" అన్నాను.

"త్వరగా భోజనం చేసెయ్. నాకూడా ఇవ్వాళ ఆఫీసుకు రావాలి. అందరికీ పరిచయంచేస్తాను. నువ్వే హెడ్‌మాస్టర్‌వి అని చెప్పేస్తాను. పెళ్ళికి లగ్గాలు పెట్టిస్తాను. అప్పుడే నాకు మనశ్శాంతి" అంటున్న మామయ్యను చూశాను. మామయ్య పొట్ట కొంచెం ఉబ్బినట్లుంది. ఇంతలో మామయ్య తగినంత నశ్యం తన ముక్కులోకి రవాణా చేసేశాడు. హాలు దద్దరిల్లేట్లుగా ఇద్దరం తుమ్మేసేం. "శుభస్య శీఘ్రమ్" అని భోజనాలకు లేచాం.

నిండు చందమామ తన వెలుగు జిలుగులతో ప్రేమికులను ఏడిపించి కోరికలతో పీడించే వేళ, నేనూ, నా మరదలు 'మంగ' శోభనం గదిలో వున్నాం. "ఇదిగో అచ్చం మా నాన్నగారికిలాగే తమలపాకులు తదితర సామాగ్రితో తాంబూలం కట్టాను. వేసుకోండి" అంది గోముగా మంగ. అలవాటు లేదు, అయినా వేసుకున్నాను. "అలవాటు లేనివి ఎన్నో అలవాటు చేసుకోవాల్రా" అని లోపలకు వచ్చేటప్పుడు నా ఫ్రెండ్స్ చెప్పినట్లు గుర్తుకొచ్చింది.

"నాదో కోరిక వుంది. మీరు లంక పొగాకు చుట్టకాల్చాలి" అంది మంగ బుంగమూతితో. అప్పుడు షాక్ తగిలింది నాకు. "అదేమిటి" అన్నాను. 'నాకు నిన్ను బట్టల్లేకుండా చూడాలనివుంది' అని భర్త తొలిరాత్రి అంటే పెళ్ళికూతురు శోభనం గదిలో అయిష్టంగా ముఖంపెట్టుకున్నట్లుగా ఎటో చూస్తున్నాను. "ఏమోనండీ, నాకు చుట్టపొగంటే ఎంతో ఇష్టం. ఆ పొగవాసన పీల్చకపోతే మూడ్ రాదు" అంటూంది.

అప్పుడు వెంటనే "నీకు ఇంకా ఏమేం చేస్తే మూడ్ వస్తుందేం" అంటున్న నన్ను సహజంగా ఆడాళ్ళకు వుండే వశీకరణ శక్తిగల చూపులతో, నన్ను చూసి "వాడు చూస్తున్నాడు తలుపేసేయండి" అంది.

అటుచూస్తే నిండు 'చందమామ', ఇటు చూస్తే పూబంతి 'మంగ' నా ఒడిలో నన్ను అల్లరిపెడుతూ. 'అయిపోయావురా నువ్వు' అంది నా మనసు. ●

**(స్వాతి, వీక్లీ, 23.01.2010)**